
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
5★★ జిల్లా వార్తలు
బుధవారం 3 సెప్టెంబరు 2025



కాళేశ్వరంపై సీబీఐ విచారణకు నిరసనగా ఆందోళనలు 8
●జిల్లావ్యాప్తంగా ధర్నాలు చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు
ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని అన్నందుకు విద్యార్థి ఆత్మహత్య 6

పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం

- స్థానిక ఎన్నికలకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- ఆశావహుల యత్నాలు షురూ
- తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలంటూ ప్రచారం
- పోరుకు అధికార యంత్రాగం ఏర్పాట్లు
- జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు, 385 పంచాయతీలు



జిల్లాలో స్థానిక సంస్థల వివరాలు...

జడ్పీటీసీ స్థానాలు	20
ఎంపీటీసీ స్థానాలు	216
ఎంపీపీ స్థానాలు	20
సర్పంచ్ స్థానాలు	385
వార్డులు	3,586
పంచాయతీ	
ముసాయిదా ఓటర్లు	6,07,222
పురుషులు	2,89,249
మహిళలు	3,17,964
ఇతరులు	9

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేబినెట్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. దీంతో ఎన్నికలు త్వరలోనే జరుగుతాయని తేలిపోయింది. అధికారులు ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తాజాగా గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదలచేసి అభ్యంతరాలను స్వీకరించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. అయితే ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఎన్నికలే ముందు నిర్వహిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల కోర్టు తీర్పు నేపథ్యంలో సెప్టెంబరు 30లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేలా ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాయడంతో ఈసీ సైతం ఆ దిశగా దృష్టి సారించింది.

● యేడాదికి పైగా ప్రత్యేక పాలనే..

గ్రామ పంచాయతీ ఎన్నికలు 2019లో జరగగా గత యేడాది ఫిబ్రవరి 2వ తేదీన పాలక వర్గాల గడువు ముగిసింది. ఇక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల అదే ఏడాది మే నెలలో నిర్వహిస్తే 2024 జూన్ మాసంతో పాల కవర్గాల గడువు తీరింది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీల్లో, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. కానీ ప్రత్యేకాధికారులు కొన్ని ప్రాంతాల్లో పట్టించుకోకపోవడంతో పాలన కుంటు పడుతోంది. నిధులు సైతం అంతంత మాత్రంగానే వస్తుండడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● అదిగో...ఇదిగో అంటూ

ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు త్వరలోనే జరుగుతాయంటూ హడావుడి చేయడం, ఆపై మరుగున పడడం సాధారణమైంది. ఐదారు నెలలుగా నేడో, రేపో నోటిఫికేషన్ వస్తుందని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నేతలు కూడా సంకేతాలు ఇచ్చారు. మాజీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు నియోజకవర్గాల వారీగా సమావేశాలు సైతం పూర్తి చేశారు. అయితే కుల గణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది తేలకపోవడంతో ఆశావహులు కూడా స్తబ్దంగా ఉండిపోయారు.

● కోర్టు తీర్పుతో మళ్లీ..

ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. సెప్టెంబరు 30కల్లా స్థానిక సంస్థల్లో పాలకవర్గాలు కొలువుదీరాలని తీర్పు వెలువడింది. జిల్లాలోని 385 పంచాయతీలు, 3,536 వార్డులు అంతేస్థాయిలో పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 205 ఎంపీటీసీ, 20 జడ్పీటీసీ స్థానాలకు....

- మిగతా 8లో

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

-జిల్లా విద్యాశాఖ అధికారి రాము



మొక్క నాటుతున్న డీఈవో రాము

ధర్మపురి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తల్లి పేరుతో ప్రతీ ఒక్కరు మొక్క నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా విద్యాశాఖ, అటవీ శాఖ, మున్సిపాలిటీ సౌజన్యంతో ఏక్ పేడ్ మా కే నామ్ పేరుతో వనమహోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రవిప్రసాద్, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్‌వో శ్రీనాథ్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో సదాశివుడు, ఎంఈవో సీతాలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం మహేందర్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జిల్లాస్థాయి కళోత్సవాలు



కళాప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంలోని ధరూర్ జడ్పీహెచ్ఎస్, స్కూల్ టీచర్స్ భవన్‌లో మంగళవారం జిల్లాస్థాయి కళోత్సవాలను ఘనంగా ముగిశాయి. జగిత్యాల జిల్లాలోని 200 మంది విద్యార్థులు కళోత్సవ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రాజేష్, మహేష్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్‌రెడ్డి, న్యాయ నిర్ణేతలు సతీష్, రాజేంద్రప్రసాద్, లక్ష్మన్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ అవినీతి బట్టబయలు

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

మేడిపల్లి, సెప్టెంబరు2: కాళేశ్వరంలో గత ప్రభుత్వ అవినీతి బట్టబయలైందని ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మడంల కేంద్రాంలో 50 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఎమ్మెల్సీ కవిత పరోక్షంగా ఒప్పుకుందన్నారు. కానీ కవిత ఆనాడే హరీష్ రావు, సంతోష్‌రావు అవినీతి పై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెప్పిందే కవిత ఈరోజు చెప్పిందన్నారు. హరీష్‌రావు అక్రమాలను బయట పెట్టిందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వ పోకడలకు పోకుండా ప్రజా ప్రభుత్వంలో ప్రజలు చెప్పేది విని ముందుకు పోవడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడి మండపలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రమేరెడ్డి, నాగరాజు, మాదం వినోద్, బొంగోనిరాజాగౌడ్, శంకర్, అన్వర్, మాజీద్, గంగారెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 2. (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లాలో సెప్టెంబరు మాసం చివరి వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ మంగళ వారం పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహిచకూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

భీమారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి యాళ్ళ మధుసూదన్ రెడ్డి అన్నారు. భీమారం మండల కేంద్రంలో మంగళవారం మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గుండోజి వెంకటరమణతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, క్రీడా సమైఖ్య కార్యదర్శి పెసరి తిరుమలేశ్, కండ్లపెల్లి కిషోర్, ముత్యాల ప్రశాంత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా మంజూరైన పూర్వ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు కలెక్టర్ ద్వారా అనుమతులు మంజూరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాము తెలిపారు. 51మంది బోధకులు, 51మంది ఆయాలను నియమించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బోధకులుగా పనిచేయుటకు ఇంటర్మీడియేట్, తత్సమానం లేదా ఈసీఈ, ప్రాథమిక విద్య కోర్సు చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆయాగా పని చేయువారికి ఏడవ తరగతి అర్హతగా రూ. 6వేల గౌరవ వేతనం ఇవ్వబడుతుందన్నారు. దరఖాస్తులను మండల విద్యాధికారి కార్యాలయంలో 6వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తీసుకోబడునని తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాలకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల (ఎంఆర్‌సీ)లో పొందాలని కోరారు.

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

బీర్‌పూర్,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో మంగళవారం మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. తుంగూర్ గ్రామంలోని పలు వినాయక మండపాల వద్ద గణనాథులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రక్షిత్ అనే బాలుడు ఇటీవల రేబిస్ వ్యాధితో మృతి చెందాడని విషయం తెలుసుకున్న ఆయన మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్ నాయకులు జితేందర్ యాదవ్, సింగిలివిండో ఛైర్మన్ నవీన్‌రావ్ ఉన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి



జగిత్యాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువును మంగళవారం ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సత్య ప్రసాద్ పరిశీలించి మాట్లాడారు. వినాయక నిమజ్జనం శాంతి యుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సజావుగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్‌గౌడ్, డీఎస్పీ రఘుచందర్ తదితరులు ఉన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని పెద్ద వాగు ప్రాంతంను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. పట్టణంలో ప్రతిష్ఠాపన చేసిన విగ్రహాల వివరాలను రెవెన్యూ, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని రోడ్లు మ్యాపు వివరాలను అడిగి తెలుసుకోని పలు సూచనలు సలహాలను అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జీవకర్ రెడ్డి, తహసిల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమీషనర్ రవీందర్, సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని వట్టి వాగు ప్రాంతంను ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సత్య ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను, విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన వాటిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. విగ్రహాల తరలింపుకు అడ్డు వచ్చే విద్యుత్ వైర్లను సరిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, డిఎస్పీ రాములు, మున్సిపల్ కమిషనర్ టి. మోహన్, డిఈ నాగేశ్వర్‌రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి మండలంలోని రాయపట్నం గోదావరి నది వద్ద వినాయక నిమజ్జనం కోసం మంగళవారం కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ధర్మపురి, రాయపట్నం రెండు ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వారి వెంట జగిత్యాల ఆర్డీవో మదుసూధన్, ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవీందర్‌కుమార్, ఇరిగేషన్ ఏఈఈ మహేష్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ కంప్యూటర్ సబ్జెక్టు బోధించుటకు అతిథి అధ్యాపకులకై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ బోధించుటకు అతిథి అధ్యాపకులు అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధిత సబ్జెక్టులలో పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు కలిగి యుండాలన్నారు.


పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యతన ఇస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 4వ తేదీలోగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కళాశాలలో సర్టిఫికేషన్ నిర్వహిస్తామన్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, సెర్ప్ ద్వారా అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాలను మహిళలకు అందిస్తూ, ప్రభుత్వ పథకాలను మహిళలకు అందించాల్సిన బాధ్యత ప్రతి సెర్ప్ సిబ్బందిపై ఉందని జిల్లా డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించి, అనంతరం బదిలీల పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘువరణ్ మాట్లాడుతూ జిల్లాలో సెర్ప్ కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం అప్పగించిన పనిని బాధ్యతతో పూర్తి చేయాలన్నారు. మార్కెటింగ్, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఫామ్, నాన్‌ఫామ్, సంస్థాగత నిర్మాణం, ఆర్‌సెటి, బీసీ పాయింట్ తదితర అంశాలపై అంశాల వారీగా సమీక్షించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు రమేష్, నారాయణ, నాగేశ్వర్‌రావు, స్త్రీనిధి ఆర్ఎం రాంనారాయణ, జిల్లా ఏపీయంలు శ్రీనివాస్, చక్రవర్తి, గంగాధర్, హస్సేన్‌తో పాటు అన్ని మండలాల సీసీలు, యంఎస్ సీసీలు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటున్న వైద్యులు



మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కిటకిటలాడుతున్న రోగులు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిడివిజన్‌లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వారం క్రితం కురిసిన వర్షాలతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకోవడంతో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోయింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో కొద్ది రోజులుగా జ్వరాలు ప్రబలుతున్నాయి. మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగుల రద్దీ కొనసాగుతోంది. రోగులకు రక్తపరీక్షలు నిర్వహిస్తుండగా అందులో చాలా మందికి మలేరియా, టైఫాయిడ్‌గా నిర్ధారణ అవుతోంది. జ్వరం ఎక్కువగా ఉన్నా రోగులను ఆసుపత్రుల్లోనే అడ్మిట్ చేసుకుంటున్నారు. పట్టణంతో పాటు పల్లెల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

●ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు సరిపోక ఇక్కట్లు

ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో జ్వరాలతో రోగులు కిటకిటలాడుతుంటే రూముల కటకటతో జ్వర పీడితులకు ఎక్కడ చికిత్స అందించాలో తెలియక వైద్యసిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. రోజుకు 400 కుపైగా మంది ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. దీంతో హాల్‌లోనే బెడ్‌లు వేసి వైద్యం అందించే పరిస్థితి ఏర్పడింది. ఓ పక్క పెచ్చులూడుతున్న భవనంలోనే వైద్యం చేయడంతో రోగులు భయాందోళనకు గురువుతున్నారు. నూతన భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● ప్రైవేట్‌లో దోపిడీ..

ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతుంటే మరో పక్క పలుప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు మాత్రం అందినకాడికి దండుకుంటున్నారని పలువురు జ్వర పీడితులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఆర్ఎంపీలకు కమీషన్ ఇస్తూ రోగులకు అడ్డగోలుగా టెస్టులు చేస్తూ దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత వైద్యాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విష జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి..



కొన్ని రోజులుగా వైరల్ ఫీవర్స్ ఎక్కువగా వస్తు న్నాయి. టైఫాయిడ్, మలేరియా తదితర కేసులు వస్తున్నాయి. రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్నాం. వార్డులలో 80బెడ్‌లలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం. రోజూ400కు పైగా ఓపీ లు చూస్తున్నాం. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

-షాజిద్ అహ్మద్, మెట్‌పల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డ ఒకరికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనిజ కోహిర్‌కార్ మంగళవారం తీర్పునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో 2020 సంవత్సరంలో బక్కశెట్టి కొమురయ్య అనే వ్యక్తి చోరీకి పాల్పడి నగదుతో పాటు విలువైన వస్తువులు అపహరించుకు వెళ్లాడు. పోలీసుల విచారణలో మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన కొమురయ్య దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టు హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు సాక్ష్యులను ప్రవేశపెట్టగా అదనపు పీపీ రాజేష్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి కొమురయ్యకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

నీటి కోసం మహిళల నిరసన

శంకరపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గృహ అవసరాలకు నీరు రావడం లేదని మొలంగూర్ గ్రామంలో ఓ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం రాత్రి రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నామని సంబంధిత అధికారికి చెప్పిన ఫలితం లేకపోవడంతో రోడ్డుపైన నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు.

సాగులో డ్రోన్లు

ఆధునికతను అందిపుచ్చుకుంటున్న రైతులు
ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తే మరింత మేలు





ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతికతలను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణవైపు అడుగులు వేస్తున్నారు. కూలీల కొరతను అధిగమించడంతో పాటు పంట దిగుబడి పెరిగి పెట్టుబడి ఖర్చులు తగ్గించే క్రమంలో రైతులకు డ్రోన్లు ఒక వరంలా మారాయి. ఒక రైతు చేతి పంపుతో ఒకరోజులో సుమారుగా 5 ఎకరాల వరకు పిచికారీ చేస్తే నేడు డ్రోన్ల రాకతో ఖర్చు తగ్గడంతో పాటు ఒకరోజులో గరిష్ఠంగా 30 ఎకరాల వరకు మందు పిచికారీ చేస్తున్నారు. చేతి పంపుతో పిచికారీ చేయడానికి ఒక లీటర్ మందు ద్రావణం సుమారుగా 7 నుంచి 8 పంపుల నీటిలో అంటే 150 నుంచి 160 లీటర్ల నీటిలో కలుపుతారు. దీనివల్ల ద్రావణం పలుచగా అవడం వల్ల మందు ప్రభావం కొంత మేర తక్కువగా ఉంటుంది. అదే డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేయడం కోసం ఒక లీటర్ మందు ద్రావణం ఒక డ్రోన్ ట్యాంక్‌లో అంటే సుమరుగా 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తారు. దీనివల్ల ద్రావణం చిక్కగా ఉండి మొక్కల ఆకుల భాగంలో పడటం వల్ల ఎక్కువ ప్రభావం చూపుతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుత సమయంలో కొంత మేర యూరియా కొరత ఉన్నందున యూరియా వాడకాన్ని తగ్గించడానికి నానో యూరియా వాడకాన్ని వ్యవసాయశాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. డ్రోన్లతో నానో పిచికారీ చేస్తే ఎక్కువ ప్రభావం చూపుతుందని తెలుపుతున్నారు. ఇప్పుడిప్పుడే వ్యవసాయంలో డ్రోన్లు వాడుతుండటంతో వాటి ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. ఇందుకు అనుగుణంగా డ్రోన్ల వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రైవేట్ కంపెనీలు రాయితీ పైన, బ్యాంక్ లోన్ ఇప్పిచడం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న రైతు

డ్రోన్ల వాడకంపై అవగాహన :రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి, ఇబ్రహీంపట్నం



డ్రోన్ల ద్వారా నానో యూరియాతో పాటు పురుగు మందులు కూడా కలిపి పిచికారి చేయడం వల్ల పెట్టుబడి తగ్గుతుంది. అలాగే మందు ప్రభావం మొక్కలపైన ఎక్కువగా పడి అధిక దిగుబడులు సాధించ వచ్చు. మండలంలోని గ్రామాల్లో డ్రోన్ల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని మందలించిన తల్లి

- విద్యార్థి ఆత్మహత్య



విష్ణువర్ధన్(ఫైల్)

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన కుమారుడిని తల్లి మందలించడంతో ఉరి వేసుకొని విష్ణువర్ధన్ (15) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. లింగంపేటకు చెందిన మామిడిపెల్లి రాజమురళి-సరిత దంపతుల కుమారుడైన విష్ణువర్ధన్ జగిత్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. విష్ణువర్ధన్ పాఠశాలకు సరిగ్గా వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ సెల్ ఫోన్‌లో ఆన్‌లైన్స్ గేమ్స్‌కు బానిసయ్యాడు. గమనించిన తల్లి సరిత తన కుమారుడిని సోమవారం సాయంత్రం తీవ్రంగా మందలించింది. మనస్థాపం చెందిన విష్ణువర్ధన్ తన ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మూడేళ్ల వయసులో తన ఇంటి వద్ద గోడ కూలిన ప్రమాదంలో బయటపడి బతికిన విష్ణువర్ధన్‌ను కుటుంబ సభ్యులు అల్లారు ముద్దుగా పెంచారు. తండ్రి రాజమురళి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లగా కొడుకు మృతితో స్వగ్రామానికి వచ్చి రోధించిన తీరు స్థానికులను కలచివేసింది. తల్లి సరిత మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ ఎస్‌ఐ కుమారస్వామి పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

ధర్మారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తికి అప్పుల బాధతో పాటు అనారోగ్యం తోడవగా పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కమ్మరిఖాన్‌పేటకు చెందిన పుప్పాల చంద్రశేఖర్ (28) తాగుడుకు బానిసై అప్పులపాలయ్యాడు. దీనికి తోడు నెలరోజుల క్రితం పచ్చకామెర్లు కావడంతో చికిత్స చేయించినా నయం కాలేదు. అనారోగ్యంతో పాటు అప్పులు తోడవడంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ గత నెల 27న పురుగుల మందు తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ చంద్రశేఖర్ మంగళవారం మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ మృతి

బీర్‌పూర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం పై నుంచి పడి చాకటి అన్నపూర్ణ (37) అనే మహిళ మంగళవారం మృతిచెందింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలం మంగేళ(గోడుగూడెం)గ్రామానికి చెందిన చాకటి అన్నపూర్ణ చిన్న కొడుకు మెట్‌పల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. బాబుకు జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని మంగళవారం ఉదయం అన్నపూర్ణకు దూరపు బంధువైన జాన్సన్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రంగసాగర్ గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి అన్నపూర్ణ మృతి చెందింది. మృతురాలి భర్త చాకటి చిత్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టాయ్ మనీని చూపించి మోసం

- నలుగురి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న టాయ్ మనీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు ఆడుకునే టాయ్ మనీ(కార్టున్ పేపర్స్)ని అసలు నోట్ల మధ్య పెట్టి మోసాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని తుంగూరు గ్రామానికి చెందిన పలాజీ శ్రీనివాస్(32), ఉప్పు రమేష్(38), జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కొండ నరేశ్, సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన గుడిసెల సంతోష్(31)లను అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. జగిత్యాల ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, రమేశ్, నరేశ్, సిరిసిల్ల ప్రాంతానికి చెందిన సంతోష్ అనే నలుగురు వ్యక్తులు కలిసి హైదరాబాద్‌లోని గుర్తుతెలియని వ్యక్తి వద్ద చిన్న పిల్లలు ఆడుకునే టాయ్ మనీని తీసుకొచ్చారు. ఒరిజి నల్ నోట్ల మధ్య పెట్టి షాపింగ్ చేసిన సమయాల్లో బిల్ కడుతూ మోసం చేయాలనే ఉద్దేశంతో సిరిసిల్లకు వచ్చారు. ఈ క్రమంలో సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద నలుగురు వ్యక్తులు తిరుగుతుండగా సమాచారం రావడంతో వెంటనే వెళ్లి అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరి వద్ద 14కట్టల 500 టాయ్‌నోట్స్, రూ. 21వేల నగదు, ఒక కారు, ఐదు మొబైల్స్ స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశామని సీఐ వివరించారు.

జాతీయ రహదారి భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం భూసేకరణ సమస్యలపై సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా చర్చించారు. భూములు కోల్పోయిన వారికి అందిన పరిహారం, మార్కెట్ ధర, భూమి అప్పగించకపోవడానికి కారణాలు వంటి వాటిపై అడిగి తెలుసుకున్నారు. ఇదివరకే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సహకరించేలా చూడాలన్నారు. సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరించి జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని భారత జాతీయ రహదారి సంస్థకు స్వాధీనం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, భారతీ జాతీయ రహదారి సంస్థ ప్రాంతీయ అధికారి శివశంకర్, వరంగల్ ప్రాజెక్టు సంచాలకులు నాగరాజు, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్‌బాబు, రెవెన్యూ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్-జమ్మికుంట రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మంగళవారం మృత్యువాత పడ్డాడు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన సంగెం నరేష్ (33) సుతారి పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బిజిగిరిషరీఫ్ దర్గాకు దర్శనం కోసం వచ్చాడు. తిరిగి గుర్తుతెలియని రైల్లో వెళ్తుండగా జమ్మికుంట-బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామంలోని మానేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న సల్పాల సమ్మయ్య, సల్పాల అశోక్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

గర్భంలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ గర్భిణి ప్రసవం కోసం రాగా గర్భంలో శిశువు మృతి చెందడంతో ఆసుపత్రి ఆవరణలో బంధువులు ఆందోళనకు దిగారు. గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన దుబ్బ రాజ్యలక్ష్మికి సోమవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షలు చేసి అడ్మిట్ చేసుకున్నారు. మంగళవారం ఉదయం స్కానింగ్ నిర్వహించగా శిశువు కదలికలు బాగానే ఉన్నాయని కుటుంబ సభ్యులకు తెలిపారు. సాధారణ ప్రసవం కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పిన వైద్యులు సాయంత్రం శిశువు కదలడం లేదని, మృతి చెందాడని రాజ్యలక్ష్మి భర్త వంశీకి తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిందని ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. గర్భంలో మృతి చెందిన శిశువును తీయడానికి వైద్యులు పట్టించుకోలేదని, మూడు రోజులు అయినా కూడా శిశువును బయటకు తీయవచ్చని సమాధానం చెప్పడంతో వైద్యులపై బంధువులు మండిపడ్డారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే శిశువు మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. గైనకాలజిస్ట్ వైద్యులు అందుబాటులో లేక పోవడం, హెచ్‌ఓడీ కూడా సరిగా ఆసుపత్రికి రాకపోవడం, సాధారణ ప్రసవాల కోసం ప్రయత్నిస్తుండడంతో శిశువులు గర్భంలోనే మృతి చెందుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కూడా సెక్షన్లు చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

ఆకస్మికంగా కదలికలు ఆగిపోయాయి..

డాక్టర్ స్రవంతి, గైనకాలజిస్ట్

రాజ్యలక్ష్మి గర్భంలో శిశువు కదలికలు మధ్యాహ్నం ఆకస్మికంగా ఆగిపోయాయి. గర్భంలోని శిశువును తీయడానికి ప్రయత్నాలు చేశాము. జరిగిన సంఘటనపై వివరాలు చెప్పడానికి ఆమె నిరాకరించారు.



ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా రజని



రజినికి నియామకపత్రం అందిస్తున్న ఆర్ కృష్ణయ్య

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన విద్యావేత్త దాసరి రజిని నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేసి అందజేశారు. ఈ సందర్భంగా రజినీ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ బీసీ మహిళా సంక్షేమంతో పాటు సంఘం పటిష్టత కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రజినీ నియామకంపై భారత్ సురక్షాసమితి బాధ్యులు ఏసీఎస్ రాజు, కాశీనాథం, అరవలక్ష్మీ సంఘ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత



బాధితుడికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై ప్రశాంత్‌రెడ్డి

కోనరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అందజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాకు చెందిన భూక్య శ్రీకాంత్ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి బాధితుడికి మొబైల్ అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలుచేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని, కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్‌సాగర్, జిల్లా సహాయకార్యదర్శి దుర్గం బోగేష్, గట్టు ఆకాశ్, రాకేష్, సందేశ్, మానస, మధు, సాయి, ఆదిత్య, వంశీ, రామ్‌చరణ్, ఉదయ్‌కిరణ్, రాకేష్, రఘు, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ చందు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు విడుదల చేయాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రిషి, అనిల్, సురేష్ తదితరులు ఉన్నారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

జమ్మికుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలో సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే గొంతులను నొక్కుతూ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేష్, బాసిర సంపత్‌రావు, దండిగారి సతీష్, కన్నం సదానందం, ముద్దమల్ల కుమార్, రాజకుమారి, క్రాంతి, రాజు, కిరణ్, ఐలయ్య, తిరుపతయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి బెట్టింగ్ దందా

- ముఠా ఆటకట్టు - ఎనిమిది మంది అరెస్ట్ - రూ. 29.81 లక్షలు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన బెట్టింగ్ ముఠా సభ్యులు, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లి ఆన్‌లైన్‌లో బెట్టింగ్ దందా నిర్వహిస్తున్న ముఠా ఆటకట్టించిన సిటీ సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎనిమది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 29.81 లక్షల రూపాయలు, 18 సెల్‌ఫోన్‌లు, 13 ఏటీఎం కార్డులు, మూడు పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన రాజేష్, అస్లాం, జగిత్యాలకు చెందిన వినయ్ కుమార్, సాయివర్ధన్‌గౌడ్, కోల రామ్, వేల్పుల ఆకాశ్, ప్రణయ్, పెద్దపల్లికి చెందిన రాహుల్, జశ్వంత్‌తేజ, జోడ వేణుగోపాల్ బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లారు. కొద్దిరోజులు పనులు చేసి జీవించారు. చేస్తున్న పనుల ద్వారా వస్తున్న ఆదాయం సరిపోకపోవడంతో ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. ఖేలోస్టార్, ఖేలో-24, ఖేలో ఎక్స్ఛేంజ్, ఖేలో స్పోర్ట్స్, విన్ మ్యాచ్ వంటి ఖేలో గేమ్స్ యాప్‌లలో రిజిస్టర్ చేసుకుని బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఎస్ఆర్‌నగర్ పరిధిలోని నాగార్జున సర్కిల్ సమీపంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందగా దాడి చేశారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు రాజేష్, అస్లాం పరారీలో ఉన్నారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపారు.

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద



ధర్మపురి వద్ద శ్రాద్ధ మండపం వరకు చేరిన గోదావరి నీరు

ధర్మపురి, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం మంగళవారం కొనసాగింది. గోదావరి ఎగువ మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతుంది. దీనికి తోడుగా ఎస్సారెస్పీ నుంచి 1,25,000 క్యూసెక్కులు, తెల్లవారు జామున కడెం ప్రాజెక్టు నుంచి 1,14,091 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి ప్రవాహం వేగంగా కొనసాగింది. ప్రస్తుతం సంతోషీమాత దేవాలయం, శ్రాద్ధ మండపం, నదీ స్నానఘట్టాలు ఆనుకుని నీరు ప్రవహిస్తోంది. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ధర్మపురి వద్ద సంతోషీమాత, మంగళిగడ్డ, సోమవిహార్, మహాలక్ష్మి, రాయపట్నం వద్ద స్నానఘట్టాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. స్నానం చేసే భక్తులను గోదావరి నదీ లోతు ప్రదేశంలోనికి అనుమతించడంలేదు. భక్తులు లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయవద్దని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకార్మికులకు లోతు ప్రదేశాలకు వెళ్లవద్దని మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ హెచ్చరికలు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బండి సంజయ్ కృషి

శంకరపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేస్తున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని మొలంగూర్, కేశవపట్నం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 34మంది విద్యార్థులకు సైకిళ్లను మంగళవారం పంపిణీ చేశారు.

ప్రభుత్వ హాస్టళ్ల తనిఖీ

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ హాస్టళ్లను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన వెంట మేనేజర్ రాజిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

6న ఉద్యోగుల క్రీడల ఎంపిక పోటీలు

- 9, 10 తేదీల్లో రాష్ట్ర జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల కరీంనగర్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 6న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి పోటీలను నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఐడెంటిటీ కార్డు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ప్రతిభ చాటే క్రీడాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

● నిర్వహించే క్రీడల వివరాలు

క్రికెట్, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో పురుషులకు మాత్రమే ఎంపిక పోటీలు ఉంటాయి. పరుషులు, మహిళలకు అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖో-ఖో క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

పంచాయతీ కార్యదర్శి తీరుపై ఎంపీవోకు ఫిర్యాదు

శంకరపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ పంచాయతీ కార్యదర్శి తీరుపై తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు మోరె గణేష్ మండల పంచాయతీ అధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి పనుల కోసం వెళ్లిన ప్రజలకు పనులు చేయకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని, వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. అతనిపై విచారణ జరిపించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.


స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది భక్తులు అంజన్న దర్శించుకొని అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడిని కూడా దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చకులు, అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

తపాలా శాఖ ద్వారా చేయూత పింఛన్లు

పంపిణీకి ఫేస్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్
8 మండలాల్లో శ్రీకారం



భగత్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా శాఖ ద్వారా గ్రామాల్లో చేయూత పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కరీంనగర్ తపాలా డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లోని 44 గ్రామపంచాయతీల్లో మొదటి విడతగా పోస్టల్ ద్వారా చేయూత పింఛన్లు అందించేందుకు సిబ్బందిని సిద్ధం చేశారు.

ఇందులో భాగంగా ఆయా పంచాయతీల్లోని 33 మంది బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు కలెక్టర్ పమేలా సత్పతి కార్యాలయంలో ఆండ్రాయిడ్ మొబైల్స్ అందజేశారు. ఫేస్ రికగ్నేషన్ ద్వారా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లు లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

బోగస్ ఏరివేసేందుకు చర్యలు

చేయూత పింఛన్ల పంపిణీలో బోగస్ ఏరి వేసేందుకు ఫేస్ రికగ్నేషన్ ప్రక్రియకు ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా దివ్యాంగులకు 4,016 రూపాయలు, వృద్ధులకు 2,016 రూపాయల చొప్పున ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. ఫేస్ రికగ్నేషన్ ప్రక్రియతో బోగస్ ఏరివేతతో పాటు, ఫింగర్ ప్రింట్ పడని వృద్ధుల ఇబ్బందులను తొలగించేందుకు సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.




తప్పనున్న తిప్పలు

రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్‌తో తపాలా శాఖ ద్వారా పింఛన్లు పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు తిప్పలు తప్పనున్నాయి. గతంలో ఫింగర్ ప్రింట్, బ్యాంకుల ద్వారా పింఛన్లు తీసుకునే వెసులుబాటు ఉండేంది. ప్రస్తుతం తపాలా శాఖ ద్వారా గ్రామాల్లోనే తమకు మంజూరైన పింఛన్లను అందించనుండడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు రావడం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,50,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 29 గేట్లు పైకి ఎత్తి 1,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 1,51,897 క్యూ సెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 666 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.


దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద..

అంతర్గాం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 1.25లక్షల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 28977, వాగులు, వంకల నుండి 1.83 లక్షల క్యూసెక్కుల మొత్తం 3.37 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శనివారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 37గేట్లు ఎత్తి 3.83లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో..

బోయినపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ప్రాజెక్టుకు మంగళవారం 17210 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14000 క్యూసెక్కులు మానేరు, ములవాగు ద్వారా 3210 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. కాగా మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి దిగువ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు మూడు గేట్ల ద్వారా 7500 ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600 తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.52 ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.888 టీఎంసీలకు 26.324 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నాలుగు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రసుత్తం 2.09 టీఎంసీల నీరు ఉంది. మధ్య మానేరు ద్వారా 12800 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



మెగా ఆపరేషన్ పాలసీలో ఇన్సూరెన్స్..

ఆర్ఎఫ్‌సీఎల్‌లో యంత్రాల వైఫల్యంతో ఉత్పత్తికి నష్టం జరిగితే మెగా ఆపరేషన్ పాలసీలో ఇన్సూరెన్స్ లభించనున్నది. రూ.6000కోట్లతో నిర్మించిన ఈ పరిశ్రమ యేటా రూ.6000కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం చేస్తుంది. 1284ఎకరాల భూములతోపాటు ఆస్తులు ఉన్నాయి. యాజమాన్యం రూ.2500కోట్లు యంత్రాలపై ఇన్సూరెన్స్ చేసినట్టు తెలుస్తుంది. ప్రభుత్వరంగ ఇన్సూరెన్స్ సంస్థ మెగా ఆపరేషన్ పాలసీలో ఇన్సూరెన్స్ ఉన్నది. ఆపరేషన్ వైఫల్యాలతో ఉత్పత్తి నష్టం జరిగితే ఇన్సూరెన్స్ లభించనున్నది. గతంలో కూడా ఆర్ఎఫ్‌సీఎల్ ఇన్సూరెన్స్ క్లైమ్ చేసింది. రోజుకు సుమారు రూ.1కోటికి పైగా ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఉంది. జూలై షట్‌డౌన్‌లో 18 రోజులు, ఆగస్టు షట్‌డౌన్‌లో 16రోజులకు పైగా ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు రూ.35 నుంచి రూ.50కోట్లు ఇన్సూరెన్స్ క్లైమ్ అయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు గ్యాస్ చార్జీల భారం కూడా తప్పనున్నది. సంస్థకు రూ.150కోట్ల ఉత్పత్తి నష్టం జరిగినా గ్యాస్ చార్జీలు, ఇన్సూరెన్స్‌లతో పెద్దగా నష్ట ప్రభావం ఉండదు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో కొనసాగుతున్న మరమ్మతులు

- ఈనెల 10వ తేదీ తరువాతే ఉత్పత్తి దశలోకి
- మరమ్మతులకు హైదరాబాద్‌కు యంత్ర సామగ్రి
- ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనుల్లో ఎల్అండ్‌టీ సిబ్బంది
- ఫ్యాక్టరీకి ఇన్సూరెన్స్.. రైతులకు తీరని కష్టాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్‌లో యంత్రాల మరమ్మతు కొనసాగుతోంది. అమ్మోనియా పైప్‌లైన్‌లో లీకేజీతో ఉత్పత్తి నిలిచిపోగా యూరియా దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారు. పరిశ్రమలో ఇప్పటి వరకు 150కోట్ల వరకు ఉత్పత్తి నష్టం ఏర్పడింది. ఆగస్టులో పరిశ్రమ నుంచి తెలంగాణకు 65వేల టన్నులు అందించాల్సి ఉండగా యంత్రాల మరమ్మతుతో ఇతర రాష్ట్రాల నుంచి యూరియా తెప్పించుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి పునరుద్ధరణకు మరో వారం గడువు పట్టే అవకాశం ఉంది. ఈనెల 10వ తేదీ తరువాతే ఉత్పత్తి దశలోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మేలో వార్షిక మరమ్మతుల తరువాత రెండు సార్లు అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. మే 8 నుంచి జూన్ 15వరకు వార్షిక మరమ్మతులు జరిగాయి. ప్లాంట్‌ను జూన్ 16న ఉత్పత్తి దశలో పెట్టగా మళ్లీ నెల రోజులకే అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో షట్‌డౌన్ అయ్యింది. జూలై 16 నుంచి ఆగస్టు 4వరకు ఉత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ ఆగస్టు 5 నుంచి ఉత్పత్తి ప్రారంభమై పది రోజులు కూడా పరిశ్రమ నడవకుండానే 14న మళ్లీ పైప్‌లైన్ లీకై షట్‌డౌన్ అయ్యింది. కీలకమైన హెచ్‌టీఆర్ బైపాస్ చేయడంతో అమ్మోనియా పైప్‌లైన్‌లపై ఒత్తిడి పెరుగుతుంది. హెచ్‌టీఆర్ పని చేసిన సమయంలో అధిక యూరియా ఉత్పత్తికి లోడ్‌ను 110శాతం వరకు కూడా పెంచిన సందర్భాలున్నాయి.

కానీ హెచ్‌టీ ఆర్‌ను బైపాస్ చేసిన తరువాత లోడ్ సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ఈ హెచ్చు తగ్గుల తేడాలతోనే అమ్మోనియా పైప్‌లైన్లలో క్రాక్‌లు ఏర్పడి లీకవుతున్నాయి. ప్లాంట్‌లోని యంత్రాలు సాంకేతిక వైఫల్యాలతో ఉత్పత్తి నిలిచిపోతుంది. యంత్ర సామగ్రిని మరమ్మతు కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఇక్కడ మరమ్మతు పనులను ఎల్అండ్‌టీ సిబ్బంది చేస్తున్నారు.

రైతాంగానికే గోస...

ఆర్ఎఫ్‌సీఎల్ ఆగస్టు మాసంలో 65వేల టన్నుల రాష్ట్రానికి యూరియా ఇవ్వాల్సి ఉంది. ఆగస్టు 4 నుంచి 14వ తేది వరకు 20 వేల టన్నులు వచ్చింది. వర్షాకాల సీజన్‌లో యూరియా వాడకంలో ఆగస్టు మాసం కీలకం. ఆగస్టు 14న షట్‌డౌన్ కావడంతో ఉత్పత్తి, సరఫరా నిలిచిపోయింది. దీంతో రైతులు యూరియా కోసం రోడ్డెక్కారు. దీని ప్రభావం ఢిల్లీని తాకి పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం వరకు సమస్య వెళ్లింది.



రాజన్న ఆలయంలో ఈవో
ఆకస్మిక తనిఖీలు
క్షేత్రస్థాయిలో పలు విభాగాల్లో రికార్డుల పరిశీలన


లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవో రమాదేవి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఈవో రమాదేవి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం తనిఖీల్లో భాగంగా సెంట్రల్ గోదాం, లడ్డు ప్రసాద కౌంటర్, ప్రధాన బుకింగ్ కౌంటర్, కళ్యాణకట్ట, నూతనంగా ఏర్పాటు చేసిన స్వామివారి నిత్య కళ్యాణం, చండీహోమం, సత్యనారాయణ వ్రతం నిర్వహించే ప్రదేశాలను, గోదాంలోని రికార్డులు, వస్తువులను పరిశీలించారు.

పంటకోత ప్రయోగాల డిజిటల్ యాప్‌పై శిక్షణ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగాల డిజిటల్ యాప్‌పై నగరంలోని గణాంక భవన్‌లో మంగళవారం ఎంపీఎస్‌వోలు, ఏఈవోలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రాజారాం మాట్లాడుతూ ప్రతీ ప్రాథమిక కార్యకర్త అయిన ఎంపీఎస్‌వోలు, ఏఈవోలు వారికి కేటాయించిన గ్రామాల్లో పొరపాట్లు లేకుండా పంటకోత ప్రయోగాలు నిర్వహించాలని ఆదేశించారు. సేకరించిన వివరాలను సమయానికి డీజీసీఇఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, స్టాటిస్టికల్ ఆఫీసర్ కిషన్‌రావు, ఏడీఏలు, ఎంఏవోలు, డీవైఎస్‌వోలు, ఎంపీఎస్‌వోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

మత్తడి ఎత్తు తగ్గించాలి

సైదాపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మకల్ చెరువు మత్తడి ఎత్తు తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ బొమ్మకల్ చెరువు మత్తడి ఎత్తు ఉండడం వల్ల చాలా వరకు రైతుల భూములు చెరువులో మునిగి పోయి రైతులు నష్టపోతున్నారన్నారు. వెంటనే మత్తడి ఎత్తు తగ్గించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్, రైతులు రమాదేవి, పద్మనాభం, శంకర్, వెంకటరాజం, సుదర్శన్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్ అందజేస్తున్న రాజన్నసిరిసిల్ల కలెక్టర్

మానేరులో గల్లంతైన వ్యక్తి కుటుంబానికి
రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం
రూ. 5 లక్షల చెక్కు అందజేసిన కలెక్టర్

గంభీరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద గల్లంతైన వ్యక్తి కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. అలాగే వరదలో చనిపోయిన పశువుల యజమానులకు పరిహారం చెక్కును అందజేశారు. మానేరు వద్ద పంపుకాడి నాగయ్య మానేరు వాగు దాటుతుండగా గల్లంతయ్యాడు. అతడి భార్య లక్ష్మికి చెక్కును కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం అందజేశారు. లింగన్నపేట గ్రామానికి చెందిన మణెమ్మకు చెందిన 2 పశువులు, ప్రవీణ్‌కు చెందిన ఒక పశువు వరదల్లో గల్లంతు కాగా, రూ.లక్ష, రూ.50వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ విజయ, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

దర్శనీయం.. దత్తాత్రేయుడి ఆలయం

- చుట్టూ మిడ్ మానేరు జలాలు
- ఎంపీ నిధులతో బోట్ సౌకర్యం
- కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి


మిడ్‌మానేరు నీటి మధ్యలో ఆలయం (ఏరియల్ వ్యూ)


సర్ప రూపంలో వెలసిన దత్తాత్రేయుడు

బోయినపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ మిడ్ మానేరు జలాలు... మధ్యలో గుట్టపై పచ్చటి చెట్ల మధ్య దత్తాత్రేయస్వామి ఆలయం.. గుట్ట ఒక ద్వీపంలా కనిపిస్తూ కనువిందు చేస్తోంది. బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామ శివారులో ఈ ఆలయం ఉంది. అరుదైన రాహు రూపా(సర్పరూప) శయన జంట సర్పాలతో దాగి ఉండి దత్తాత్రేయుడు గుట్టపై వెలసి నిత్య పూజలు అందుకుంటున్నాడు. అంతేకాకుండా గుట్టపై వెంకటేశ్వర స్వామి ఆలయం ఉన్నది.

కోరిన మొక్కలు తీర్చే స్వామి..

కోరిన మొక్కలు తీర్చే స్వామిగా శ్రీదత్తాత్రేయ స్వామివారిని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి ఏటా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. ఏటా దత్త జయంతిని భక్తులు, గ్రామస్థులు వైభవంగా నిర్వహిస్తారు.

ఎంపీ నిధులతో ఆలయానికి బోట్ సౌకర్యం..

మిడ్ మానేరు నిండడంతో గతేడాది ఆలయం చుట్టూ బ్యాక్ వాటర్ చేరింది. దీంతో నిత్య పూజలకు ఇబ్బందులు కావడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.10.86 లక్షలతో బోట్ సౌకర్యం కల్పించారు.

గురు, ఆది వారాల్లో ప్రత్యేక పూజలు...
రత్నాకర శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు



నిత్య పూజలతో పాటు ప్రతి పౌర్ణమి, గురు, ఆది వారాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఆయా రోజుల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తాం.



రాజన్న ఆలయ మొదటి దశ
అభివృద్ధి పనులు ప్రారంభం

కళాభవనం కూల్చివేత

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులకు రూ.76 కోట్లు, అన్నదాన సత్రం నిర్మాణ పనులకు రూ.33 కోట్ల నిధులు మంజూరైన విషయం తెలిసిందే. అయితే అభివృద్ధి పనులను వేగవంతం చేసి సమ్మక్క-సారక్క జాతరకు వచ్చే భక్తులకు ఆలయాన్ని పునఃప్రారంభించి స్వామివారి దర్శనం కలిగేలా అందుబాటులోకి తీసుకు రావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఈవో రమాదేవీలు చూస్తున్నారు.

అందులో భాగంగా రాజన్న ఆలయంలో పనులను మంగళవారం కూల్చివేతలతో ప్రారంభించారు. రాజన్న ఆలయం ముందు భాగంలో ఈశాన్యం వైపు 1992 సంవత్సరంలో సుమారు రూ.76 లక్షలతో నిర్మించిన కళాభవన్‌ను కూల్చివేశారు. అంతే కాకుండా కల్యాణకట్ట వద్దగల క్యూలైన్‌లను సైతం తొలగించి అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. 33 యేళ్లుగా సేవలందించిన కళాభవన్ కూల్చివేయడంతో భక్తులకు అందించే సేవలైన శివకళ్యాణం, చండీహోమం, సత్యనారాయణ స్వామి వ్రతం వంటి పూజలను రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లోకి మార్చి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి చర్యలు తీసుకున్నారు.


33 యేళ్లుగా సేవలు అందించిన కళాభవన్


కళాభవన్‌ను నుంచి కూల్చివేత పనులు

బద్ది పోచమ్మ ఆలయంలో కొనసాగుతున్న పనులు..

రాజన్న ఆలయ మొదటి దశ అభివృద్ధి పనుల్లో భాగంగా శ్రీభీమేశ్వర ఆలయంలో భక్తులకు దైవ దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్‌లు, షైడవర్‌లు, అభిషేక పూజలు, సంకల్ప పూజల కోసం షెడ్డుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. భీమేశ్వర ఆలయంలో పనులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన వెంటనే రాజన్న ప్రధాన ఆలయంలో దర్శనాలను నిలిపివేసి భీమేశ్వర ఆలయంలో దర్శనాల ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్ భీమేశ్వర ఆలయంలో వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు నిరసనగా ఆందోళనలు

●జిల్లావ్యాప్తంగా ధర్నాలు చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు







జగిత్యాలలో కళ్లకు నల్ల గంతలు కట్టుకుని ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, కోరుట్ల, మెట్‌పల్లిలో రాస్తారోకో

జగిత్యాల క్రైం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు నిరసనగా మంగళవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నివేదిక బహిర్గతం చేయకుండా, ప్రజల దృష్టిని మరల్చేందుకే సీబీఐ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామాకు తెర లేపిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వొళ్లెం మల్లేశం, ఆనంద రావు, గంగాధర్, దేవేందర్ నాయక్, శివకేసరి బాబు, సమిండ్ల శ్రీనివాస్, ప్రవీణ్ గౌడ్, లక్ష్మణ్ రావు, గంగారాం, రాజన్న, వెంకటేశ్వర్ రావు, కిషోర్, రిజ్వాన్ తదితరులు ఉన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, మాజీ సర్పంచ్‌లు దారిశెట్టి రాజేష్, వనతడుపుల అంజయ్య, మాజీ కౌన్సిలర్ల్ పెర్ల సత్యం, బట్టు సునిల్, సజ్జు, నాయకులు ప్రభు, మురళి పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

●**ధర్మపురి:** పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, మాజీ ఎంపీపీ సౌళ్ల భీమయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, కుక్కల గంగారెడ్డి, సంగి శేఖర్, స్తంభంకాడి మహేష్, ఇనుగంటి ప్రేమ్‌చందర్‌రావు పాలొన్నారు.

●**రాయికల్:** పట్టణంలో నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్, అనిల్ కుమార్, మండల కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, మైనార్టీ అధ్యక్షుడు చాంద్‌పాషా, మాజీ కౌన్సిలర్లు సాయి కుమార్, సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నా లో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు తేలు రాజు నాయకులు బైరి మల్లేష్, కొండ ప్రభాకర్, మ్యాకల జలందర్, సాంబారి గంగాధర్, చుక్క అంజి, శాతల్ల రమేష్, లత్తినేని నరేష్, అలీమ్, అరవింద్‌గౌడ్, భాస్కర్ నాయక్, సుమన్, గుర్రం స్వామి, కొండ ప్రభాకర్, పల్లపు వెంకటేష్, మధన్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మల్లాపూర్‌లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పీసీ ఘోష్ కమిషన్‌తో తప్పుడు విచారణ చేయించి బీఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీటీసీ రవి, మాజీ వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, గడ్డం భూమారెడ్డి ఉన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దశరథ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, జాజాల జగన్‌రావు, నాయకులు రమేష్, సత్యనారాయణ, గోపిడి లక్‌పతిరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

●**ఎండపల్లి:** ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సింహాచలం జగన్, గాజుల మల్లేశం, మారం జెలెందర్ రెడ్డి, మేరుగు జాని, గాధం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

●**బీర్‌పూర్:** మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నేరెల్ల సుమన్, గడ్డమీది రామచంద్రం, రాజేశం పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు గాజుల గంగాధర్, ఉపుగండ్ల నరేందర్ రెడ్డి, మాదారపు కరుణాకర్ రావు, మంత్రి వేణుగోపాల్, కరుణాకర్‌రెడ్డి, విజయ్ యాదవ్, సత్యనారాయణ రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు వెల్గటూర్‌లో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, రంగు తిరుపతి, మూగల సత్యం, ముల్కాల గంగారాం, కొప్పుల సురేష్, జగదీశ్వర్, రాజేష్, అశోక్, శివరాజం, లావణ్య, నర్సయ్య, మహేష్, సుధాకర్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, భాను, శశి, శేఖర్, పితంబర్‌రావు పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో మండల అధ్యక్షులు గోస్కుల జలందర్, మండల కోఆర్డినేటర్ బోయపోతు గంగాధర్, ప్యాక్స్ చైర్మన్ చంద్రోలివెంకట మాధవ్ రావ్, మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, కాంపెల్లి హన్మాండ్లు, మాజి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత పోస్టర్లు తొలగింపు



మెట్‌పల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీని తొలగిస్తున్న కార్యకర్త

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేసిన నేపథ్యంలో మెట్‌పల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో గల కవిత ఫ్లెక్సీలు, పోస్టర్లను మంగళవారం కార్యకర్తలు తొలగించారు. మెట్‌పల్లి పట్టణ కేంద్రంలోని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుల నివాసం దగ్గర, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫ్లెక్సీ బోర్డులు, పోస్టర్లను ఆ పార్టీ కార్యకర్తలు చించి వేశారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్‌కు గురైన కొద్ది సేపటికే బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీలను తొలగించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

యూరియా కోసం రైతుల బారులు

కొడిమ్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలోని యూరియా గోదాం వద్ద, మండల కేంద్రంలో, మండలంలోని తిర్మాలాపూర్ సింగిల్ విండోలలో మంగళవారం రైతులు యూరియా కోసం గంటల తరబడి వేచియున్నారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా కావటం లేదని పలువురు రైతులు ఆరోపించారు. గత పదిహేను రోజులుగా తాను యూరియా కోసం ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు గౌరాపూర్ గ్రామానికి చెందిన రైతు మహిపాల్‌రెడ్డి తెలిపాడు. యూరియా కోసం వచ్చిన రైతులు వేచి చూసి పాస్ మిషన్ ద్వారా యూరియా రసీదు పొంది యారియాను తీసుకు వెల్లారు.

ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను అందించాలని బీజేపీ నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరాలో నిర్లక్ష్యాన్ని వీడాలని ఆయన అన్నారు. కాగా యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని ఏవో పి.జ్యోతి అన్నారు. సోమవారం నాటికి 1099.33 మెట్రిక్ టన్నులు యూరియాను రైతులకు అందించాం. మంగళవారం మండలంలోని మూడు సింగిల్ విండో కార్యాలయాలకు 45మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా రైతులకు అందిస్తున్నామని తెలిపారు.

చెక్కులు పంపిణీ

మల్లాపూర్, సెప్టెంబరు 02 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తదాం రాజుపల్లి గ్రామానికి చెందిన సీఎం సహాయనిధికి ఎంపికైన లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు చెక్కులు అందజేశారు. మంగళవారం టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు మంజూరు చేయించిన చెక్కులను స్థానిక నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మామిడి రాజశేఖర్‌రెడ్డి, బద్దం సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

పంటల పరిశీలన

రాయికల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు, భూపతిపూర్ గ్రామంలోని పసుపు తోటలను ఉద్యాన అధికారి కెస్వాతి మంగళవారం పరిశీలించారు. అధిక వర్షాల వల్ల తోటల్లో నిలిచిన నీటిని కాలువలు చేసి బయటకు పారద్రోలాలని సూచించారు. కార్యక్రమంలో రాయికల్ ఉద్యాన విస్తరణ అధికారి వంశీ, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

బీర్‌పూర్,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో ఈ నెల 9 నుండి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాలు జరుగనున్నట్లు ఎంఈవో నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం..

భీమారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రి, జిర్ఫ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంగడి ఆనందం సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 40 మందిని ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు.

రాకపోకలు పునరుద్ధరించాలి

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వాగులో పేరుకపోయిన గుర్రెపు డెక్క తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకపోయారు. మంగళవారం మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని పెద్ద వాగును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. వంతెన పరిస్థితిని పరిశీలించారు. బ్రిడ్జి క్రింది బాగంలో పూర్తిగా గుర్రపు డెక్క ఇరుక్కుపోయి నీరు వంతెనపై నుండి ప్రవహించడంతో వంతన ప్రమాదం ఉందని ఉన్నత అధికారులకు ఫోన్ ద్వారా కృష్ణారావు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తులు జరుగుతున్నాయి. ఇందుకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పోలింగ్ రెండు విడతల్లో నిర్వహించడానికి నిర్ణయించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఎంపిక చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

●**ఎన్నికల సంఘం వైపు చూపు..**

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. మంత్రి మండలి లేఖ ఆధారంగా ఎన్నికల సంఘం ఏ ఎన్నికలకు, ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తుందోనన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఇప్పటి వరకు ఉన్న రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని సైతం ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. పంచాయతీరాజ్ చట్టం సవరించి ప్రత్యేక జీవో జారీ అయినట్లయితే జిల్లాలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారనున్నాయి. దీంతో జడ్పీటీసీ, ఎంపీటీసీలు మొదలు కొని సర్పంచ్, వార్డు సభ్యుల వరకు ఎలాంటి రిజర్వేషన్ వస్తుందనే దానిపై రాజకీయ పార్టీలతో పాటు ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

●**ఆశావహుల హడావుడి**

పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి దాదాపు ఏడాదిన్నర, జడ్పీ, మండల పరిషత్ పాలకవర్గాలు గడువు ముగిసి ఏడాది దాటింది. పల్లెల్లో రానున్న ఎన్నికలపై రాజకీయ పార్టీతో పాటు ఆశావహులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు వారి నిరీక్షణకు తెరదించేలా ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ముందుకు రావడంతో ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటి వరకు పట్టించుకోని పలువురు ఓటర్లను సైతం ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. యువతకు విందులు ఏర్పాటు చేస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి అవసరమైన పనులన్నీ చేసి పెడుతామనే నమ్మకం కల్పించేలా గట్టిగా ప్రయత్నిస్తున్నారు. దీంతో పల్లెల్లో రాజకీయ హడావుడి పెరిగింది.

వైఎస్సార్‌కు ఘన నివాళి



జగిత్యాలలో వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చరిత్రలో నిలిచిపోయాయని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరాభవన్ కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల రాజేందర్, దుర్గయ్య, శేఖర్, నాగేంద్ర, శ్రావణ్, జీవన్, బింగి రవి, రజనికాంత్, శంకర్, నెహాద్ తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్/కోరుట్ల/మెట్‌పల్లిటౌన్/రాయికల్:/మల్యాల/పెగడపల్లి/ఇబ్రాహీంపట్నం/మల్లాపూర్/వెల్గటూర్/గొల్లపల్లి:** నిరంతర పేదల సంక్షేమం కోసం పరితపించి వారి హృదయాల్లో చిరస్థానం సంపాదించుకున్న నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవనంలో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మెట్‌పల్లిటౌన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా రాయికల్, మల్యాల, పెగడపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల్లో కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



ఇటిక్యాలలో మహిళల కుంకుమ పూజలు

జగిత్యాల క్రైం,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రోత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. పలు మండపాల వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి క్షేత్రంలోని పలు వీధుల్లో నెలకొల్పిన వినాయక మండపాల్లో పలువురు భక్తులు మంగళవారం కుంకుమ పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం వద్ద వినాయక మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణనాథుడికి లక్ష దూరువార్చన పూజలు నిర్వహించారు. లోక క్షేమం కోసం వినాయక మండపం వద్ద వేదపండితులు హోమం నిర్వహించారు.

పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య, వర్తక సంఘాల మండల, పట్టణ శాఖల అధ్యక్షులు కూరగాయల సంతోష్‌కుమార్, మురికి శ్రీనివాస్, అక్కినపెల్లి రాజేందర్ పాల్గొన్నారు.

●**రాయికల్:** మండల కేంద్రంలో గౌడ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద మంగళవారం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. దర్శనానికి వచ్చిన మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బండి ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు. ఇటిక్యాల గ్రామంలో వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా గౌడ సంఘం భవనంలో మహిళలచే కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు.

●**వెల్గటూర్:** వెల్గటూర్ దుబ్బలవాడ, రాజక్కపల్లి, మొక్కట్రావుపేట్, పైడిపల్లి గ్రామాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్ గణేష్ మండపాలను సందర్శించి నిర్వాహకులకు తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజెపి మండల అధ్యక్షుడు గోపతి జనార్ధన్, ధర్మపురి నియోజకవర్గ మాజీ కన్వీనర్ కస్తూరి సత్యం పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపం 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మహా రుద్రహోమం ఘనంగా నిర్వహించారు.

●**మల్లాపూర్:** మల్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో మండపాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని అంగడి బజారులో వినాయక మండపాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

●**మల్యాల:** వినాయక నవరాత్రోత్సవాల్లో బాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాలు, దీపాలంకరన, కుంకుమ పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ కవితపై కేసీఆర్ నిర్ణయం సరైనదే

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సరియైనదని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. మంగళవారం మండలంలోని మారుతీనగర్ గ్రామంలోని సమావేశంలో తుల ఉమ మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత గత కొంల నుంచి ప్రవర్తిస్తున్న తీరు, కానసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించి, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కవితను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిందని, తెలంగాణ ప్రాంతానికి బీఆర్ఎస్ పార్టీ గుండెలాటిందని పేర్కొన్నారు. అలాంటి పార్టీలో ఉండి విభేదిస్తున్న కవిత కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని, తనపై కొందరు కుట్రలకు పాల్పడుతున్నారని ఇటీవల ఆరోపణలు చేశారన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల కోసం పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని సాధించిందన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రాంతంలోని నీటి సమస్యలు ఉండందని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి తాగు, సాగును నీరందిస్తున్న ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. అలాంటి కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ కుట్రపురితంగా సీబీఐ విచారణ వేయడాన్ని రాష్ట్ర ప్రజలు విమర్శలు చేస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగే 13వ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, అధికారులు, న్యాయ వాదులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి యేగి జానకి అన్నారు. ధర్మపురి కోర్టులో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీ మార్గమే రాజ మార్గమని, చిన్న చిన్న తగాదాలకు, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు జీవితాంతం వారిని, వారి కుటుంబాలను ప్రమాదంలో పడేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి కోర్టు ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, సతీష్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మహేందర్‌సింగ్, ఎస్ఐ జమీల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు బందెల రమేష్, న్యాయవాదులుగడ్డం సత్యనారాయణరెడ్డి, రౌతు రాజేష్, రామడుగు రాజేష్, సుంకె రాజు, కస్తూరి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల



మల్యాలలో జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదేశాల మేరకు రూపొందించిన ఓటరు తుది జాబితాను సిద్ధం చేసినట్లు ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవో ప్రచురించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లోని 212 వార్డుల్లో పురుషులు 17,227, మహిళాలు 19,638, ఇతరులు ఒకరిని కలుపుకుని మొత్తం 36,866 ఓటర్లతో డ్రాఫ్ట్ జాబితాను తయారు చేయడం చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌డెంట్ నర్సింహరెడ్డి, కార్యదర్శి అశోక్, సిబ్బంది స్వామి, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా ముసాయిదా తుది జాబితాను ఎంపీడీవో ఇ. స్వరూప నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, కార్యాలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సురేష్, కొడిమ్యాల కార్యదర్శి వంశీవర్ధన్, మధు, సిబ్బంది పరుషరాం, పాల్గొన్నారు.

●**రాయికల్:** మండలంలోని 32 గ్రామ పంచాయతీల ఓటర్ల తుది జాబితాను మంగళవారం ఎంపీడీవో చిరంజీవి విడుదల చేశారు. 32 గ్రామాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాలను గ్రామ పంచాయతీలు, మండల ప్రజాపరిషత్ కార్యాలయ నోటీసు బోర్డులపై ఉంచారు. మొత్తం ఓట్లు 39,412 కాగా, ఇందులో పురుషులు 18,554 మంది, స్త్రీలు 20,858 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

●**బీర్‌పూర్:** ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాలవారిగా మంగళవారం ఎంపీడీవో భీమేష్ విడుదల చేశారు. మొత్తం ఓటర్లు 17738, పురుషులు 8472, స్త్రీలు 9266 ఉండగా మొత్తం పోలింగ్ కేంద్రాలు 136 ఉన్నాయని 100 వరకు ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 63 ఉన్నాయని తెలిపారు.

●**మల్యాల:** స్థానిక ఎన్నికలకు సంబందించి తుది ఓటర్ జాబితాను మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రదర్శించారు. గ్రామం, వార్డుల వారిగా మండలంలోని 19 గ్రామాలకు సంబందించి జాబితాను ప్రదిర్శించగా మండలంలో మొత్తం 40307 ఓటర్లు ఉన్నారు.

ఇందులో మహిళలు 21155, పురుషులు19150 కాగ ఇతరులు ఇద్దరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్ ఇతర అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘మొక్కలు నాటి సంరక్షించాలి’

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా అటవీ శాఖ అధికారి మాదాసు రవిప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. పట్టణంలోని స్థానిక మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో కోరుకంటి రవి కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి పద్మారావు, మహేష్, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ నవీన్ పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని మార్కండేయ వీది పాఠశాలలో విద్యార్థులు ఎంఈఓ నరేశంతో కలిసి మున్సిపల్ కమిషనర్ రవీందర్ మొక్కలను నాటి ట్రీగార్డును ఏర్పాటు చేశారు.

పాఠశాలల్లో వనమహోత్సవం

బీర్‌పూర్: మండలంలోని కొల్వాయి జిల్లా పరిషత్ పాఠశాల, బీర్‌పూర్ మండలకేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, ఎంఈవో నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు సత్యరాజ్, సుదర్శన్, పాల్గొన్నారు.

కొడిమ్యాల: వన్ ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో బాగంగా మంగళవారం మడలంలోని అన్ని ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమాలలో ఎంపీడీవో స్వరూప, ఎంఈవో అయిత శ్రీనివాస్, ఏపీవో సతీష్, ఎంపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** మండలంలోని మోడల్‌స్కూల్‌లో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమాలలో ఎంఈవో సులోచన, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాశిగామలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ భారతి సమస్యలను పరిష్కరించాలి

మల్లాపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భూ భారతిలో వచ్చిన సమస్యలను పారదర్శకంగా పరిశీలించిన తరువాతనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లాతా అధికారులకు సూచించారు. మంగళవారం మల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు

కొడిమ్యాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9 నుండి 11 వరకు 14, 17 సంవత్సరాల లోపు బాల బాలికలకు మండల స్థాయి ఎస్.జీ.ఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు మండల కమిటీ చైర్మన్, ఎంఈవో ఎ. శ్రీనివాస్, ఎస్.జీ.ఎఫ్ మండల కన్వీనర్, పీడీ బూట్ల రాజమల్లయ్య మంగళవారం తెలిపారు. వివరాలకు పీడీ రాజమల్లయ్య 9441431287సెల్ నెంబర్‌లో ఆసక్తిగల వారు సంప్రదించాలన్నారు.

క్రికెట్‌లో విద్యార్థి ప్రతిభ

కొడిమ్యాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల టూడేస్ లీగ్ మ్యాచ్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. కొడిమ్యాల పట్టణానికి చెందిన క్రీడాకారుడు ఎర్రోజు తక్షిల్ మొదటి రోజు జరిగిన గౌడ్స్‌క్సీ తరుపున ఆడుతున్న 125 బంతుల్లో 156 పరుగులతో అజేయంగా నాటవుట్‌గా నిలిచాడు. క్రీడాకారున్ని ప్రిన్సిపాల్ వేణు, పీడీ భాస్కర్ అధ్యాపకులు అభినందించారు.

చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసివేసిన ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు మాజీ మంత్రి, చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ సంఘం సభ్యుడు జీవన్‌రెడ్డిని కోరారు. సోమవారం ఆయన జీవన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

మల్యాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నూకపల్లిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.20లక్షల నిధులు మంజూరు చేయగా ప్రొసీడింగ్స్ మంగళవారం ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు అందజేశారు.